సాక్షి నిజామాబాద్

బుధవారం । 23 । జూలై । 2025



గంజాయి నిర్మూలనకు..

జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు.

- 8లో ▸



వేతన వెతలు తీరేదెన్నడు

మిషన్ భగీరథలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు రాక పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.1 /23.5

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు న్నాయి.

న్యూస్‌రీల్

అధిక ధరలకు ఎరువులు విక్రయించొద్దు

- డీఏవో గోవింద్



రుద్రూర్: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) ఎం. గోవింద్ హెచ్చరించారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో మంగళవారం ఎరువుల, పెస్టిసైడ్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ స్టాక్, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. ఎరువులతో పాటు ఇతర మందులను లింక్ చేసి విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు యూరియా తక్కువ మోతాదు వాడాలని, అవసరం మేరకు కాంప్లెక్స్ ఫర్టిలైజర్‌ను వాడుకోవాలని సూచించారు. సమస్యలుంటే స్థానిక వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీఏవో వెంట కోటగిరి, పోతంగల్ వ్యవసాయాధికారులు టీ రాజు, బీ నిశిత, ఏఈవోలు ఉన్నారు.

ఆయకట్టుకు నీటిని వదలాలి

- ఎమ్మెల్యే వేముల డిమాండ్



బాల్కొండ: శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి, కాకతీయ కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టి బాల్కొండ నియోజకవర్గ ఆయకట్టు రైతులను ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తాతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాకతీయ కాలువ ద్వారా కొంత నీటిని వదిలితే కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ శివారులో గేట్లు దించి నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి నీటి విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు.

రుణాలకు పట్టాపాస్ పుస్తకాలు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

నిజామాబాద్ అర్బన్: రైతులకు డిజిటల్ రికార్డుల ఆధారంగా రుణాలు మంజూరు చేయాలని అన్ని బ్యాంకులకు సూచించినట్లు కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల మంజూరు కోసం బ్యాంకులు రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాలను తమ వద్ద పెట్టుకోవాల్సిన అవసరం లేదని, పాస్‌బుక్ పేరిట రుణాలను తిరస్కరించకూడదని పేర్కొన్నారు. భూభారతి చట్టం–2025లోని సెక్షన్ 10(6), సెక్షన్ 10(7) ల ప్రకారం భూములపై రుణాలను మంజూరు చేసే సందర్భంలో భూహక్కుల రికార్డులను ఉపయోగించి రుణాలను ప్రాసెస్ చేయాలన్నారు. ఆదేశాలను అత్యవసరంగా పరిగణిస్తూ వెంటనే అమలు చేయాలని బ్యాంకర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

నిజామాబాద్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు



డెంగీ బూచీ..
ప్రైవేటు దోపిడీ

డెంగీ ఫీవర్ పేరిట కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు రోగులను దోచేస్తున్నాయి. సాధారణ జ్వరంతో ఆస్పత్రిలో అడుగు పెట్టినా.. ఏవేవో వైద్య పరీక్షలు చేస్తూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ర్యాపిడ్ టెస్టుతోనే డెంగీ ఫీవర్‌గా నిర్ధారిస్తూ ఒక్కో రోగి నుంచి వేలల్లో వసూలు చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న 'డెంగీ' తంతు తెలిసినా సంబంధిత వైద్యశాఖ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- జ్వరంతో వస్తే అడ్మిట్
- ర్యాపిడ్ టెస్ట్‌తోనే పాజిటీవ్ అంటూ చికిత్స చేస్తున్న వైనం
- ఒక్కో రోగికి రూ. 40 వేల నుంచి రూ.80 వేలకు పైగా ఖర్చు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో బాదుడు మరూ
- కొరవడిన వైద్యశాఖ పర్యవేక్షణ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా పీడితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. కాగా, డెంగీ ఫీవర్‌ను నిర్ధారించే ఎలీసా టెస్ట్ కేవలం వైద్యారోగ్యశాఖ పరిధిలోని టీ–హబ్‌లోనే ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే డెంగీ అనుమానిత లక్షణాలు గల రోగి రక్త నమూనాలను టీ–హబ్‌కే పంపించాలనే నిబంధన ఉంది. వీరే సదరు రోగికి ఉన్నది డెంగీ ఫీవర్ అవునో? కాదో? నిర్ధారిస్తారు. కానీ, వీటన్నింటిని బేఖాతరు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల వారే స్వయంగా ర్యాపిడ్ టెస్టులు చేస్తూ చికిత్స చేస్తున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ నగరంలోని సుమారు 250, బోధన్ డివిజన్‌లో 30, ఆర్మూర్ డివిజన్‌లోని 40 వరకు ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ ఫీవర్ ట్రీట్‌మెంట్ జరుగుతోంది. జూన్, జూలై నెలలో సుమారు 200 వరకు డెంగీ ర్యాపిడ్ టెస్టులు చేసి పాజిటీవ్ అంటూ చికిత్స చేసినట్లు సమాచారం.

వేలల్లో ఫీజులు..

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులకు వర్షాకాలంలో డెంగీ ఫీవర్ కాసుల పంటగా మారింది. జ్వరంతో రోగి వస్తే మొదట అడ్మిషన్ ఫీజుతోపాటు సీబీపీ, డెంగీ, మలేరియా తదితర రకాల పేర్లతో సుమారు రూ. 6 వేల ఖర్చుతో టెస్టులు చేస్తారు. ఆ తర్వాత మూడు నుంచి నాలుగు రోజులు ఆస్పత్రిలో అడ్మిట్ అయితే తగ్గిపోతుందని చెప్తారు. నిత్యం ఉదయం, సాయంత్రం టెస్టులు చేస్తూ అదనంగా రూ. 2 వేల నుంచి 4 వేలకు వసూలు చేస్తారు. రోగికి రక్త కణాలు (ప్లేట్‌లెట్స్) తక్కువ ఉంటే అదనంగా రూ. 1000 వరకు బిల్లు వేస్తారు. ఒక్క రోజుకు వాడే మందులకు రూ. 4వేలకు పైనే ఖర్చు అవుతోంది. వైద్యుల ఫీజు, రూమ్‌ల ఫీజు అదనం. ఇలా ఒక్కో రోగి నాలుగు రోజులుండి డిశ్చార్జి అయితే రూ. 40 వేలకు పైనే ఫీజు, వారం రోజులు ఉంటే రూ. 60 వేలకు పైనే ఖర్చవుతోంది. ఇక మల్టీ, సూపర్ స్పెషాలిటీల పేరిట ఉన్న ఆస్పత్రుల ఫీజులు మరింత ఎక్కువగా ఉంటాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అంతంత మాత్రమే..

పల్లెలు, తండాల్లో సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. జిల్లాలోని జీజీహెచ్‌లో రోజుకు 50, ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో 10, బోధన్ జిల్లా ఆస్పత్రిలో 15 మంది వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందుతున్నారు. మిగతా సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్‌లల్లో మాత్రం ఒకరు లేదా ఇద్దరు చొప్పున రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. కాగా, నిత్యం ఒక్కో ప్రైవేటు ఆస్పత్రిలో పదుల సంఖ్యలో రోగులు చేరడం గమనార్హం. అందుకు గ్రామాల్లోని పీఎంపీ, ఆర్ఎంపీల సహకారం ఉంటోంది. ఇదంతా తెలిసినా వైద్యశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వస్తేనే చర్యలు తీసుకుంటామనే ధోరణిలో ఉన్నారు.

తనిఖీలకు ఆదేశాలు..



ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఏం జరుగుతుందో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని చెప్పాం. ఎక్కడైనా రోగులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకునే అధికారం ఉంది. డెంగీ విషయంలో మరింత సీరియస్‌గా తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. – రాజశ్రీ, జిల్లా వైద్యాధికారి

పాముల బస్తీలో వ్యక్తిగత మరుగుదొడ్లు



పాములబస్తీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ సిబ్బంది

- రెండ్రోజుల్లో పనులు ప్రారంభం
- నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయింపు
- కాలనీలో పర్యటించిన నుడా చైర్మన్, మున్సిపల్ అధికారులు
- సామూహిక మరుగుదొడ్ల కూల్చివేతపై చర్యలెప్పుడో?

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని పాములబస్తీలో సామూహిక మరుగుదొడ్ల కూల్చివేతపై ఈ నెల 21న 'సాక్షి'లో 'కూల్చిందెవరు?' శీర్షికన ప్రచురితమైన కథనానికి నగర పాలక సంస్థ అధికారులు, నుడా చైర్మన్ స్పందించారు. మంగళవారం ఉదయం నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ డీఈ రషీద్, పంచాయతీరాజ్ ఏఈలు మురళీమోహన్, నరేశ్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు పాముల బస్తీని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సామూహిక మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలని మున్సిపల్ అధికారులకు నుడా చైర్మన్ సూచించారు.

శాశ్వత పరిష్కారం దిశగా..

పాముల బస్తీలో సుమారు 300 మంది వరకు నివసిస్తుంటారు. సుమారు 25 వరకు ఇళ్లు ఉండగా, అన్నీ ఉమ్మడి కుటుంబాలే ఉన్నాయి. ఒక్కో ఇంట్లో ముగ్గురు, నలుగురు అన్నదమ్ముల కుటుంబాలు ఉంటాయి. వీరికి స్వచ్ఛ భారత్ పథకం ద్వారా మాజీ మేయర్ ఆకుల సుజాత హయాంలో నాలుగు సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. అప్పటి నుంచి ఈ మరుగుదొడ్లను కాలనీవాసులు ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల ఈ మరుగుదొడ్లను కూల్చివేయడంతో ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా నిర్మాణమవుతున్న ఓ కార్పొరేట్ విద్యాసంస్థకు మద్దతుగా మున్సిపల్ అధికారులే సామూహిక మరుగుదొడ్లను కూల్చివేసినట్లు కాలనీ వాసులు ఆరోపించారు. సామూహిక మరుగు దొడ్ల కూల్చివేత తర్వాత మొబైల్ మరుగుదొడ్ల వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితులపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన నుడా చైర్మన్ కేశవేణు, మున్సిపల్ అధికారులు కాలనీని సందర్శించి మరుగుదొడ్లులేని 13 ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. అందుకోసం ఎస్‌జీఎఫ్ ద్వారా రూ. 5 లక్షలు, ఇతర నిధుల నుంచి మరో రూ. 5 లక్షలు కేటాయించి పనులు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. బుధవారం మరుగుదొడ్లకు ముగ్గుపోసి, రెండ్రోజుల్లో పనులు చేపట్టానున్నామని తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

చర్యలతోనే రక్షణ!

స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లను కూల్చివేసిన అంశంపై ఉన్నత అధికారులు స్పందించలేదు. కూల్చిన వారిపై చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దీనిపై సంబంధిత మున్సిపల్ ఉన్నతాధి కారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

'సాక్షి'కి రుణపడి ఉంటాం



మరుగుదొడ్ల కూల్చివేతలపై కాలనీవాసులంతా కలిసి మున్సిపల్ అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాం. ఎవరూ సమస్యను పట్టించుకోలేదు. 'సాక్షి'లో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. అధికారుల్లో కదలిక తెచ్చేలా కథనం ప్రచురించిన సాక్షికి రుణపడి ఉంటాం.

– మహేందర్ సింగ్, పాములబస్తీ

సంతోషకరం



ఇంటికో మరుగుదొడ్డి కట్టిస్తామని నుడా చైర్మన్ కేశవేణు, అధికారులు చెప్పారు. దీంతో మా సమస్యకు పరిష్కారం దొరికింది. నాయకులు, అధికారులు కాలనీకి వచ్చి సమస్యకు పరిష్కారం చూపడం సంతోషకరం.

– లక్ష్మణ్ సింగ్, పాములబస్తీ



కూల్చివేసిన సామూహిక మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్

కూల్చివేతలపై కమిషనర్ ఆగ్రహం

- నివేదిక ఇవ్వాలని ఏసీపీకి ఆదేశం

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని పాములబస్తీ వాసుల కోసం స్వచ్ఛ భారత్ కింద నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్ల కూల్చివేతపై మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం మున్సిపల్ ఈఈ మురళీ మోహన్‌రెడ్డి, డీఈ రషీద్, ఏసీపీ శ్రీనివాస్‌లతో కలిసి పాములబస్తీని సందర్శించారు. కూల్చివేసిన మరుగుదొడ్లపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరుగుదొడ్ల సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవన అనుమతులపై ఆరా తీశారు. వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని ఏసీపీ శ్రీనివాస్‌ను ఆదేశించారు. పాముల బస్తీ వాసుల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్ వాహనం అందుబాటులో ఉంచాలని సూచించారు.

అసంపూర్తి ఇళ్లకు ఇందిరమ్మ నిధులు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: వైఎస్ఆర్ హయాంలో ఇళ్లు మంజూరై బేస్‌మెంట్ వరకు బిల్లులు వచ్చిన వారికి తాజాగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వర్ని మండల కేంద్రంలో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూరు, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన 1,699 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా 6 లక్షల 12 వేల మందికి కొత్తగా కార్డులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలకు తెల్లరేషన్ కార్డు అవసరం పడుతుందని, పేదలకు రేషన్ కార్డులు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనర్హులు, ధనవంతులు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉంటే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలని, అనర్హులు పేదల నోటికాడి బుక్కను లాక్కునే ప్రయత్నం చేయవద్దని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి కింద ఇంటి నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా ఉంటే వారికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏఎంసీ చైర్మన్ సురేశ్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, మాజీ వైస్ చైర్మన్ గోపాల్, పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు హరిదాసు, గంగారాం, అంబర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ రుద్రూర్ మండల అధ్యక్షుడు తోట అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

ముడుపులిస్తేనే చెరువుల లీజు!



ఓ మత్స్యకార సొసైటీ సభ్యులు చెరువు లీజు అగ్రిమెంట్ చేసుకునేందుకు డివిజన్ ఎఫ్‌డీవో వద్దకు వెళ్లారు. మీ సేవ కేంద్రంలో చెల్లించిన ఫీజు చూపించారు. లీజు అగ్రిమెంట్ బాండ్ ఇచ్చినందుకు ఆనవాయితీగా సదరు ఎఫ్‌డీవోకు కొన్ని డబ్బులు ఇవ్వగా, ఇంత తక్కువ నేనేం చేసుకోవాలంటూ వారిపైనే విసిరేసినట్లు తెలిసింది. రూ.2 వేలకు తక్కువ తీసుకోనంటూ చెప్పడంతో అడిగినంత ఇచ్చి వచ్చారంటా! ప్రస్తుతం ఇదే విషయంపై శాఖలోని కొందరు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇలా ప్రతి ఎఫ్‌డీవో స్థాయిలో చెరువుల లీజుకు అదనపు వసూళ్లు చేసినట్లు ఆరోపణలున్నాయి.

- మత్స్యశాఖలో నిలువు దోపిడీ
- ఎఫ్‌డీవోలపై ఆరోపణలు
- మీ సేవలో ఫీజు చెల్లించినా, అధికారుల చేతులు తడపాల్సిందే
- ఫిర్యాదులు వచ్చినా చర్యలు శూన్యం
- మత్స్యకార సొసైటీల ఆవేదన



డొంకేశ్వర్(ఆర్మూర్): మత్స్యశాఖలో అవినీతి పెరిగిపోయింది. పనికో రేటు అన్నట్లుగా మారింది. మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు. మొన్న బైలా రిజిస్ట్రేషన్లలో వసూళ్లకు పాల్పడిన సంగతి రాష్ట్ర శాఖకు, గత కలెక్టర్ దృష్టికి వెళ్లిన విషయం మరచిపోకముందే చెరువుల లీజులో ముడుపులు తీసుకున్నట్లుగా ఆరోపణలు బయటకు వస్తున్నాయి. ఏకంగా శాఖలోని ఉద్యోగులే దీనిపై చర్చించుకోవడం గమనార్హం. జిల్లాలో చెరువులు, కుంటలు కలిపి 1,037 ఉండగా, మత్స్య సహకార సంఘాలు 350 పైగా ఉన్నాయి. చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు సొసైటీల్లో సభ్యత్వం కలిగిన మత్స్యకారులకే అధికారం ఉంటుంది. అయితే చెరువులు, కుంటలు ప్రభుత్వానికి సంబంధించినవి కావడంతో చేపలు పట్టుకున్నందుకు గాను ప్రతి ఏడాది తాసీల్ (పన్ను) కట్టాల్సి ఉంటుంది. దీనిని మత్స్య శాఖ అధికారులు చెరువు లీజు అంటారు. ఏడాదికోసారి మత్స్యకార సొసైటీలు మత్స్యశాఖతో లీజు అగ్రిమెంట్ చేసుకునేందుకు డివిజన్ స్థాయిలో ఎఫ్‌డీవోల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ ఏడాది కూడా 2024 సెప్టెంబర్ నుంచి 2025 జూన్ వరకు చెరువులకు లీజు అగ్రిమెంట్ చేశారు. చెరువుల విస్తీర్ణం ప్రకారం పెద్ద చెరువైతే రూ.400, మధ్యస్థ చెరువైతే రూ.200, పూర్తిగా ఎండిపోయే చెరువైతే రూ.60 ఫీజును మీ సేవ కేంద్రాల్లోనే కట్టాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి లీజు ఫీజు కట్టినా కూడా ఎఫ్‌డీవోలకు ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని మత్స్యకారులు వాపోతున్నారు. ఒక్కో సొసైటీ నుంచి రూ.1,500 నుంచి రూ.2వేలు వసూలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అడిగినంత ఇస్తేనే లీజు అగ్రిమెంట్ బాండ్‌పై సంతకాలు చేసి ఇస్తున్నారని, ఇది ఆనవాయితీగా మారిందని శాఖలోని కొందరు ఉద్యోగులే బహిరంగంగా చెప్తున్నారు. ఈ అదనపు వసూళ్లపై శాఖ ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదులు వచ్చినా మందలించి వదిలేశారే తప్ప చర్యలు తీసుకోలేదు. దీంతో ఏడీపై విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ పథకాల అమలులో కలెక్టర్లే కీలకం

- వీసీలో మంత్రుల స్పష్టీకరణ



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయినీ కలెక్టర్

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, సంక్షేమ ఫలాలు పేదలకు చేరేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో కలిసి కలెక్టర్లతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో వాటి అమలుకు కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల నిర్వాహణపై తనిఖీలు నిర్వహిస్తూ, వారంలో ఒకరోజు అక్కడే బస చేయాలని ఆదేశించారు. నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. సీఎస్ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్ల నిర్వహణ తీరుపై పలు సూచనలు చేశారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు..

ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. భూభారతిలో నమోదైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివి గా మొక్కలు నాటాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వీసీలో కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

పురోగతి సాధించాలి

నిజామాబాద్ అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషిచేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో అలసత్వం వహిస్తున్న ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మున్సిపల్, గ్రామ పంచాయతీలలో లబ్ధిదారుల వివరాలను రెండ్రోజుల్లోగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు సుముఖంగా లేని లబ్ధిదారుల నుంచి లిఖిత పూర్వక లేఖలు తీసుకోవాలని, వారి స్థానంలో అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు జాబితా రూపొందించాలని సూచించారు. వన మహోత్సవం నూటికి నూరు శాతం విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి తెయూలో జాతీయ సెమినార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నేటి నుంచి రెండు రోజులపాటు జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. తెయూ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ ఇండియా–2047: స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై బుధవారం నుంచి సెమినార్ నిర్వహించనున్నట్లు సదస్సు కన్వీనర్ పున్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, గౌరవ అతిథిగా వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, తెయూ వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి హాజరువుతారన్నారు. ఈ సెమినార్‌లో 'సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్' డైరెక్టర్ రేవతి కీలకోపాన్యాసం చేస్తారన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి సుమారు 140 మంది పత్ర సమర్పణ చేయనున్నారని తెలిపారు.

జూలై 31 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షలు జూలై 31నుంచి ప్రారంభం కానున్నట్లు తెయూ పరీక్షల నియంత్రణాధికారి సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు (థియరీ, ప్రాక్టికల్), ఇంటిగ్రేటెడ్ పీజీ ఐఎంబీఏ, ఏపీఈ, ఐపీసీహెచ్ 2, 6వ సెమిస్టర్, ఐఎంబీఏ 8, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు జూలై 31 నుంచి ఆగస్టు 14వరకు జరుగుతాయన్నారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

వేతన వెతలు తీరేదెన్నడు?

- మిషన్ భగీరథ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు కరువు
- పట్టించుకోని ఏజెన్సీ నిర్వాహకులు


మోర్తాడ్‌లోని మిషన్ భగీరథ పంప్‌హౌజ్


జీతాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహిస్తున్న మిషన్ భగీరథ కార్మికులు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): మిషన్ భగీరథ పథకం కింద పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు రాకపోవడంతో పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. సకాలంలో వేతనాలను చెల్లించకుండా ఏజెన్సీ నిర్వాహకులు మొండికేయడంతో లైన్‌మెన్‌లు, సూపర్‌వైజర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయినా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 600మంది ఉద్యోగులు..

మిషన్ భగీరథ పథకం కింద ఏర్పాటు చేసిన పంప్‌హౌజ్‌లు, సంప్‌హౌజ్‌లు ప్రభుత్వం పరిధిలోనే ఉన్నా నీటి సరఫరాను మాత్రం ఏజెన్సీలకు గత ప్రభుత్వం అప్పగించింది. సదరు ఏజెన్సీలు లైన్‌మెన్‌లను, సూపర్‌వైజర్లను నియమించుకుని వారి ద్వారా నీటి సరఫరా నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని జలాల్‌పూర్‌లో ప్రధాన పంప్‌హౌజ్ ఉండగా ఇక్కడి నుంచి మన జిల్లాలోని కొన్ని మండలాలతో పాటు కామారెడ్డి జిల్లాకు నీటి సరఫరా కొనసాగుతుంది. రెండు జిల్లాల ఏజెన్సీ పరిధిలో 600 మంది వరకు ఉద్యోగులు వివిధ హోదాలలో పని చేస్తున్నారు. లైన్‌మెన్‌లకు వారి సీనియారిటీ ప్రకారం రూ.8వేల నుంచి రూ.10వేల వరకూ వేతనం ఇస్తుండగా, సూపర్‌వైజర్లకు రూ.12వేల చొప్పున వేతనం చెల్లించాల్సి ఉంది. ఏజెన్సీలకు వారు పొందిన టెండర్ ప్రకారం బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏజెన్సీలు మాత్రం తమ పరిధిలో పని చేసే సిబ్బందికి వేతనాలను ప్రతి నెలా చెల్లిస్తూ పీఎఫ్‌ను జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఐదు నెలలుగా ఏజెన్సీ నిర్వాహకులు తమ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలను చెల్లించడం లేదు. అలాగే 2022 సంవత్సరానికి సంబంధించి మరో రెండు నెలల వేతనం ఏజెన్సీ ఉద్యోగులకు బకాయి ఉంది.

ఆందోళనలు నిర్వహించినా..

మిషన్ భగీరథ పథకం కింద పని చేస్తున్న తమకు సకాలంలో వేతనాలు చెల్లించక అవస్థలు పెడుతున్నారని నిరసిస్తూ గతంలో అనేక మార్లు ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఒక దశలో నీటి సరఫరాను నిలిపివేసినప్పటికీ ఏజెన్సీల నిర్వాహకులు మాత్రం తమ తీరు మార్చుకోలేదు. మార్చిలో పంప్‌హౌజ్‌ల ముందు ధర్నా నిర్వహించగా అప్పట్లో బకాయి ఉన్న వేతనం చెల్లించారు. మళ్లీ అప్పటి మాదిరిగానే ఇప్పుడు కూడా ఐదు నెలల వేతనం నిలిచిపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ నిర్వాహకులు, అధికారులు స్పందించి తమకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు.

> **వేతనాలు చెల్లించాలని సూచించాం..**
>
> ఏజెన్సీలు సకాలంలోనే కిందిస్థాయి ఉద్యోగులకు వేతనాలను చెల్లించాలని సూచించాం. ఫిబ్రవరి నెల వేతనం విడుదలైంది. మిగిలిన నెలలకు సంబంధించి వేతనాలను తొందరలోనే చెల్లించనున్నారు. ఏజెన్సీ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
>
> – అమీర్‌ఖాన్, డిప్యూటీ ఇంజినీర్, మిషన్ భగీరథ

'ఓపెన్ యూనివర్సిటీ'లో కొత్త కోర్సులు


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఆవరణలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ(ఆర్‌సీసీ)లో 2025–26 సంవత్సరంలో కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు, ఆర్‌సీసీ కోఆర్డినేటర్ రంజిత తెలిపారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరం నుంచి పీజీలో బీఎస్సీ–బాటనీ, కెమెస్ట్రీ, ఫిజిక్స్, బయోలాజీలతోపాటు బీఎల్ఐఎస్‌సీ కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వీటితోపాటు విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం నుంచి ఎస్‌టీఈపీ–(స్టైపెండ్ బేసెడ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం– నెలకు రూ.7000 నుంచి రూ.24000) ప్రారంభించినట్లు తెలిపారు. మహిళల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం, అత్యంత వెనుకబడిన వర్గాలైన కోయ, గోండు, ఎరుకల, ట్రాన్స్‌జెండర్ మొదలైన వారికి ఉచిత విద్య అందిస్తుందని ఆర్‌సీసీ కోఆర్డినేటర్ రంజిత తెలిపారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌లో యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత ధ్రువపత్రాలతో ఆర్‌సీసీని సంప్రదించాలని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాల సీవోఈ భరత్‌రాజ్, అకాడమిక్ కోఆర్డినేటర్ నసీదాబేగం, అదనపు కంట్రోలర్లు వినయ్‌కుమార్, రాహుల్, ఆర్‌సీసీ సిబ్బంది ఉన్నారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ట నిఘా


ధర్పల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

ధర్పల్లి: జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. ధర్పల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలను చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకై ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్ యాప్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని గ్రామాలలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌లు విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ధర్పల్లి సీఐ భిక్షపతి, ధర్పల్లి ఎస్సై కల్యాణి, సిరికొండ ఎస్సై రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

టోల్‌ప్లాజా వద్ద అప్రమత్తంగా ఉండాలి

ఇందల్వాయి: టోల్ ప్లాజా వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఇందల్వాయి వద్ద జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాని మంగళవారం ఆయన సందర్శించారు. ఎన్నో రాష్ట్రాల నుంచి వాహనాలు రాకపోకలు సాగించే వీలున్నందున టోల్‌ప్లాజా వద్ద పోలీసులు నిత్యం తనిఖీలు చేపట్టాలని సూచించారు. హైవేపై బ్లాక్‌స్పాట్‌ల చుట్టు పక్కల గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్ భాస్కర్ రావు, హాజరైన సభ్యులు

నేడు నిజామాబాద్ బస్టాండ్‌లో సంబురాలు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఆదేశాల మేరకు బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సంబురాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఆర్టీసీలో 5.84 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని కలెక్టర్ తెలిపారు. వారి ఉచిత ప్రయాణ విలువ రూ.239.17 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆర్టీసీకి చెల్లించిందన్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే 08462 – 220183 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ నిరంతరం పని చేస్తుందని, ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా సమాచారం తెలుపవచ్చని పేర్కొన్నారు. వర్షాల తాకిడికి లోనైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- కంజర జ్యోతిబాపూలే విద్యాలయం తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..


కంజర జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్/మోపాల్: విద్యాలయాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా, తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితిపై మంగళవారం సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అంతేకాకుండా కంజర జ్యోతిబాపూలే పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన డార్మెటరీ బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకరాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రేపటిలోగా భవనం ఆధీనంలో తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. పాఠశాల నిర్వహణను చక్కదిద్దాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. విద్యార్థులకు పలు అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిచ్‌పల్లి మండలంలో..

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. విద్యార్థులు, హాస్టల్ అధికారితో ఆయన మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

లింగంపేటలో సైబర్‌మోసం

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ వైద్యుడు పత్తి భాస్కర్ ఆన్‌లైన్లో డాక్టర్ అపాయింట్‌మెంట్‌పై సెర్చ్ చేశాడు. దీన్ని పసిగట్టిన సైబర్ మోసగాడు అతడికి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ బుక్ చేసే విధాన మని చెబుతూ నమ్మించాడు. ఈక్రమంలో అతడి ఖాతా నుంచి విడతల వారీగా మొత్తం రూ.51వేలు డ్రా అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించి భాస్కర్ 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చాడు.

150 సెల్‌ఫోన్‌లు రికవరీ

కామారెడ్డి క్రైం: జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వారం రోజుల్లో 150 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని, వాటి విలువ సుమారు రూ.25లక్షల వరకు ఉంటుందని ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3,551 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని తెలిపారు.రికవరీలో ప్రతిభ కనబరిచిన బృందాన్ని ఎస్పీ అభినందించారు.

వీడీసీల ఆగడాలను అడ్డుకుంటాం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్ భాస్కర్ రావు
- నగరంలో ప్రజా సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం

నిజామాబాద్ లీగల్: జిల్లాలో అభివృద్ధి మాటున గ్రామాభివృద్ధి కమిటీలు చేస్తున్న ఆగడాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉదయ భాస్కర్ రావు అన్నారు. వీడీసీలపై అభిప్రాయ సేకరణ కోసం మంగళవారం నగరంలో సంస్థ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు ప్రభాకర్, సీనియర్ న్యాయవాది, బీసీ సంఘాల నేత బాస రాజేశ్వర్ మాట్లాడుతూ.. వీడీసీలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ సావేల్ గంగాధర్ మాట్లాడుతూ.. ఈ కమిటీల్లో అన్ని కులాల ప్రతినిధులు ఉన్నారని, వారిలో మార్పుకు యత్నించాలని కోరారు. దళిత సంఘాల నేత బంగారు సాయిలు మాట్లాడుతూ.. వీడీసీలతో దళితులు పెద్దఎత్తున నష్టపోతున్నారన్నారు. మహిళా సంఘాల నేత గుజ్జ రాజేశ్వరి మాట్లాడుతూ.. వీడీసీల కారణంగా మహిళలు, సామాజికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అనంతరం ఉదయ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. వివిధ సంఘాల అభిప్రాయాలను క్రోడీకరించి, దీనిపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, ఓ నివేదికను రూపొందిస్తామన్నారు. వీడీసీలపై చట్టపరమైన పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యదర్శి మాణిక్ రాజ్ సమన్వయకర్తగా వ్యవహరించారు, నాయకులు పెద్ద వెంకటరాములు, ఆల్గోట్ రవీందర్, నర్రా రామారావు, శంకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ



వర్ని: మండలంలోని జాకోర గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు వర్ని ఎస్సై మహేష్ తెలిపారు. గ్రామానికి చెందిన తేజస్విని మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి, బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి రాగా, ఇంటి తాళంతోపాటు బీరువా తాళాలు పగలగొట్టి ఉండటం చూసి, చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటనస్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.15వేల నగదు, రెండు తులాల బంగారు గొలుసు చోరీ చేసినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

ఇందల్వాయి: ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి శివారులో అటవీ భూమిని చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసి ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రవి మోహన్ భట్ తెలిపారు. ట్రాక్టర్లను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన డిప్యూటీ రేంజ్ అధికారి తుకారం రాథోడ్, సెక్షన్ అధికారి అబ్దుల్ అతీఖ్, బీట్ అధికారులు నవీన్, ఖదీర్‌లను ఎఫ్ఆర్‌వో అభినందించారు.

చిన్నారి కిడ్నాప్– హత్యకు కుట్ర

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- బాలిక తల్లి మరోవ్యక్తితో చనువుగా ఉండటంతో కక్ష పెంచుకొని పథకం పన్నిన రెండో భర్త



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైమ్: పట్టణంలో మంగళవారం ఓ బాలిక కిడ్నాప్‌నకు గురికాగా, పోలీసులు 12 గంటల్లోగా కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. వివరాలు ఇలా.. అశోక్ నగర్ కాలనీలో చిత్తు కాగితాలు ఏరుకునే మమత అనే వివాహిత మహిళకు రెండున్నర ఏళ్ల కుమార్తె కీర్తిక ఉంది. ఆమె తన భర్త చనిపోగా కుమార్తెతో కలిసి ఫుట్‌పాత్‌పైనే జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆమెకు అశోక్ నగర్ కాలనీలోని కల్లు దుకాణంలో పనిచేసే పిల్లి రాజుతో పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల క్రితమే వారిద్దరూ ఆలయంలో పెళ్లి చేసుకుని కలిసి ఉంటున్నారు. కానీ మమత మరో వ్యక్తితో చనువుగా ఉండటంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. దీంతో వారు వేర్వేరుగా ఉంటున్నారు. ఈక్రమంలో మమత సోమవారం రాత్రి తన కుమార్తెతో కలిసి అశోక్ నగర్ కాలనీ ఫుట్‌పాత్‌పై నిద్రించింది. మంగళవారం ఉదయం ఆమె లేచి చూసేసరికి కుమార్తె కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు సాయంత్రం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వైన్స్ వద్ద చిన్నారితో ఉన్న రాజును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా మద్యం సేవించిన అనంతరం పట్టణ శివారులోని చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి చిన్నారిని చంపేయాలని కిడ్నాప్ చేసినట్లు పేర్కొన్నాడు. మమతపై కక్ష పెంచుకున్న అతడు ఆమెను మనోవేదనకు గురి చేయాలని భావించి కీర్తికను చంపాలని పథకం వేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. చిన్నారిని తల్లి మమతకు అప్పగించారు.

నాణ్యమైన పోస్టల్ సేవలు అందిస్తాం



నిజామాబాద్ లీగల్: పోస్టల్ డిపార్ట్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశామని, దీనిద్వారా నాణ్యమైన సేవలను అందిస్తామని పోస్టల్ ఎస్ఎస్పీవో ఎస్ జనార్దన్‌రెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా పోస్టాఫీస్‌లో మంగళవారం ఆయన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన సాఫ్ట్‌వేర్‌పై సిబ్బందికి గత నెల 15 రోజులుగా శిక్షణ ఇచ్చామని, నూతన సాఫ్ట్‌వేర్, శిక్షణ కార్యక్రమాలనతో తమ సిబ్బంది పనితీరు మెరుగుపడుతుందని అన్నారు. ఏఎస్‌పీ సురేఖ, ఐపీపీజీ శ్రావణ్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ అజయ్ కుమార్, పోస్టుమాస్టర్ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

జక్రాన్‌పల్లి: మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని బడా భీంగల్ గ్రామానికి చెందిన గోపిచంద్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. మంగళవారం ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎదుట అతడిని హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేయగా, నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన శుభర్, బోధన్ మండలం పెగడాపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్, వెంకటేష్, వర్మగా గుర్తించి, కేసు నమోదు చేశారు. వారిని పోలీసులు మంగళవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఎదుట హాజరుపర్చారు. జడ్జి వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

పోలీసుల సమయాన్ని వృథా చేసిన వారికి..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీకి చెందిన షేక్ అయూబ్, మూల వినోద్ ఇటీవల మద్యం మత్తులో డయల్ 100కి ఫోన్ చేసి, పోలీసుల సమయాన్ని వృథాచేశారు. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, మంగళవారం బోధన్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి వారికి ఒక రోజు జైలు శిక్ష విధించారని సీఐ వెల్లడించారు.

నందిపేట మండలంలో..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని చౌడమ్మ కొండూరు గ్రామానికి చెందిన బంగారు రాజు అనే వ్యక్తి తరచు డయల్ 100కు కాల్ చేస్తూ దుర్వినియోగం చేశాడు. దీంతో అతడిపై నందిపేట పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. జడ్జి అతడికి ఐదు రోజుల శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పరిధిలో మద్యం తాగి న్యూసెన్స్ చేసిన ఒకరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా.. సోమవారం అర్ధరాత్రి న్యూసెన్స్ చేస్తున్నట్లు ఓ వ్యక్తి నుంచి మూడో టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌కు డయల్ 100 ద్వారా కాల్ వచ్చింది. వెంటనే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, న్యూసెన్స్ చేసిన కుర్రె దినేష్, బొట్టు సాయిలను మందలించారు. కానీ కుర్రె దినేష్ పోలీసులతో అసభ్యకరంగా ప్రవర్తించి, వారి విధులకు అంతరాయం కలిగించాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈమేరకు పోలీసులు అతడిని జైలుకు తరలించారు.

ఏఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్ల అటాచ్

ఖలీల్‌వాడి: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లోని ఇద్దరె కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈనెల 17న వేల్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కనువిప్పు కార్యక్రమానికి పిలుపునిచ్చిన సందర్భంలో శాంతిభద్రతలో భాగంగా పోలీసులు పలువురు కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి ఆర్మూర్ పీఎస్‌కు తరలించారు. ఈ ఘటనపై కొందరు నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఒక వీడియో రికార్డ్ చేసి విడుదల చేశారు. పోలీస్ స్టేషన్‌లో వీడియో రికార్డ్ చేసినందుకు వారి మీద చట్టరీత్యా పోలీసులు యాక్షన్ తీసుకుంటున్నారు. ఆ స్థలంలో పోలీసుల టోపీలు ఉండడాన్ని గమనించి, విధులలో ఉన్న పోలీస్ సిబ్బందిపై క్రమశిక్షణలో భాగంగా హెడ్ కానిస్టేబుల్ ముత్యంరావు, కానిస్టేబుల్ సతీష్‌లను ఏఆర్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ వెంకటనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్, డ్రగ్స్, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని, ర్యాగింగ్ పెనుభూతమన్నారు. 18ఏళ్లు నిండిన వారే వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.